అమ్మలా ఆదరించి..

- డౌన్ సిండ్రోమ్ పిల్లల సేవలో అంబికా శిశు కేంద్రం
- ప్రత్యేక శిక్షణ, చికిత్స ద్వారా జీవన విధానంలో మార్పు
- సొంతకాళ్ల మీద నిలబడే విధంగా ప్రోత్సాహం

కర్నూలు కల్చరల్: కొందరు పిల్లల్లో మానసిక, భౌతిక పరమైన వికాసం సరిగ్గా ఉండదు. ఈ లక్షణాలను వారి ముఖంలోని మార్పుల ఆధారంగా గుర్తిస్తారు. జన్యు సంబంధమైన ఈ వ్యాధిని డౌన్ సిండ్రోమ్ అంటారు. పుట్టుకతో వచ్చే దీనిని నయం చేయలేం. అయితే, ఈ లక్షణాలతో పుట్టిన పిల్లలకు చేరదీసి జీవితంపై భరోసా కల్పిస్తోంది అంబికా శిశు కేంద్రం. అంతేకాదు వివిధ రంగాల్లో సాధారణ పిల్లలతో పోటీపడేలా తర్ఫీదు ఇస్తోంది. నేడు డౌన్ సిండ్రోమ్ డే సందర్భంగా ఆ స్వచ్ఛంద సేవా సంస్థపై ప్రత్యేక కథనం.

హేమ్‌చంద్, దేవ్‌చంద్ చారిటీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 1995 సెప్టెంబర్ 26న అంబికా శిశు కేంద్రం ఏర్పాటైంది. ప్రకాష్ నగర్‌లోని ఈ కేంద్రంలో నిపుణులైన వైద్యులు, ఉపాధ్యాయుల పర్యవేక్షణలో సెరిబ్రల్ పాల్సీ, బుద్ధి మాంద్యం, ఆటిజమ్, బహుళ వైకల్యాలు గల విభిన్న ప్రతిభావంతులైన వారికి చికిత్స చేస్తున్నారు. అలాగే మానసిక లోపం ఉన్న చిన్నారులకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధిస్తున్నారు. నేషనల్ ట్రస్ట్ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెరిబ్రల్‌ప్లాసీ, అరుణిమ్ వెల్ఫేర్ ఆఫ్ డిజేబుల్డ్ అండ్ సీనియర్ సిటీజన్ సంస్థలతో కలిసి పనిచేస్తున్న అంబికా శిశు కేంద్రం ఇప్పటి వరకు సుమారు 9 వేల మంది బహుళ వైకల్యాలు గల విభిన్న ప్రతిభావంతులకు సేవలు అందించింది.



నగరంలోని అంబికా శిశు కేంద్రం

నైపుణ్యాభివృద్ధిలో ప్రత్యేక శిక్షణ

మానసిక లోపంతో పుడుతున్న పిల్లలకు అవసరమైన రీతిలో విద్యను అందించేందుకు అంబికా శిశు కేంద్రం నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. నిపుణులైన ఉపాధ్యాయుల ద్వారా విద్యను అందిస్తున్నారు. పిల్లలకు ప్రీ, ప్రత్యేక పాఠశాలల్లో పాఠాలు చెబుతున్నారు. ప్రస్తుతం 170 మంది ఉండగా ప్రత్యేక పాఠశాలలో 30 మంది చదువుతున్నారు. ప్రత్యేక పాఠశాలలో పిల్లలకు ప్రాథమిక విద్యతో పాటు సామాజిక బాధ్యతలు, సామాజిక స్పృహ, ఇతరులపై ఆధారపడకుండా జీవించడం చదవడం, రాయడం లాంటివన్నీ నేర్పిస్తున్నారు. అలాగే వృతి నైపుణ్య రంగాల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. స్వయం ఉపాధి పొందేలా తీర్చిదిద్దుతున్నారు. సాధారణ విద్యార్థులకు తీసిపోని విధంగా మానసిక వ్యాధితో ఇబ్బంది పడుతున్న చిన్నారులకు కంప్యూటర్ సంబంధ కోర్సుల్లో సైతం తర్ఫీదు ఇస్తున్నారు.



మానసిక లోపం ఉన్న చిన్నారులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం



☛ ఈ యువతి పేరు అంజనమ్మ. జన్యు సంబంధ వ్యాధితో బాధపడుతున్న ఈ యువతిని మూడేళ్ల వయసులో తల్లిదండ్రులు అంబికా శిశు కేంద్రంలో చేర్పించారు. ప్రస్తుతం స్పష్టంగా మాట్లాడలేకపోయినా తన భావాలను అభిప్రాయాలను హావ భావాలతో స్పష్టంగా వ్యక్తీకరించగలుగుతుంది. ఉత్సాహంగా ఉంటూ తన తోటి వారందరికీ సహాయపడుతోంది. టైలరింగ్ నేర్చుకుని తన కాళ్లపై తాను నిలబడాలని లక్ష్యంగా పెట్టుకుంది.



☛ కెమెరా పట్టుకున్న ఈ యువకుడి పేరు ఎల్.వి.ప్రశాంత్. మానసిక వైకల్యంతో పుట్టిన ఈ యువకుడిని తల్లిదండ్రులు అంబికా శిశు కేంద్రంలో చేర్పించి ప్రత్యేక శిక్షణ ఇప్పించారు. ప్రస్తుతం తన పనులు తాను చేసుకోవడంతో పాటు తండ్రికి జిరాక్స్ దుకాణంలో సహాయపడుతున్నాడు. తనకు ఫొటోలు తీయడం అంటే చాలా ఇష్టమని, ఈ రంగంలో స్థిరపడాలని ఉందని చెబుతున్నాడు.

సేవలన్నీ ఉచితం



మానసిక లోపం ఉన్న చిన్నారులకు మా కేంద్రంలో అన్ని రకాల సేవలు ఉచితంగా అందిస్తున్నాం. వారిలో ఆత్మస్థైర్యం నింపే ప్రయత్నం చేస్తున్నాం. దివ్యాంగ పిల్లలతో ఎలా వ్యవహరించాలో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ కూడా ఇస్తున్నాం. ఫిజియో థెరపీ, స్పీచ్ థెరపీలలో శిక్షణ ఇస్తున్నాం. మానసిక లోపం గల పిల్లలు ఉంటే తమ కేంద్రంలో చేర్పించొచ్చు. నిపుణులైన ఉపాధ్యాయులు, డాక్టర్ల ద్వారా వారు సాధారణ పిల్లల్లా రాణించేలా తయారు చేస్తాం. సేవే లక్ష్యంగా ఈ కేంద్రం నడుస్తోంది.

–బిందు ఎన్‌షా డైరెక్టర్, అంబికా శిశు కేంద్రం

క్లుప్తంగా

మన సంస్కృతిని కాపాడుకుందాం



మాట్లాడుతున్న డాక్టర్ పి.భాస్కరయోగి

కర్నూలు కల్చరల్: భారతీయ సంస్కృతిని కలిసికట్టుగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు, కవి, విశ్లేషకులు డాక్టర్ పి.భాస్కరయోగి పిలుపునిచ్చారు. విజ్ఞాన సేవా సమితి ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దేవీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన శ్రీ శుభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకల్లో ఆయన ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ బి.వీరభద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో క్లస్టర్ యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్, ప్రముఖ విద్యావేత్తలు జి.పుల్లయ్య, కేవీ సుబ్బారెడ్డి తదితరులు తెలుగు సంస్కృతి గురించి వివరించారు. కార్యక్రమంలో విజ్ఞాన సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నరిపిరాళ్ల రామిరెడ్డి, కార్యదర్శి వెలుగుల సుంకన్న, సభ్యులు రమణయ్య, రమణారెడ్డి, మద్దిలేటి, భాస్కర్‌తో వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

కర్నూలు(లీగల్): ఓ న్యాయవాదిపై అక్రమ కేసు బనాయించిన విజయవాడ భవానీపురం సీఐ ఉమర్, ఏఎస్ఐలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం కర్నూలు న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసన తెలియజేయనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.ఆర్.కృష్ణ, ప్రధాన కార్యదర్శి కాటం రంగడు తెలిపారు. విజయవాడ న్యాయవాది భగవాన్ తన కుమార్తె లైంగిక వేధింపులకు గురవుతున్నట్లు ఫిర్యాదు చేస్తే అతని మీదనే తప్పుడు కేసు బనాయించారని, అందువల్ల రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదులు తమ నిరసన తెలియజేయాలని నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు పరిష్కరించాలని ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ వసంత రాయలు, కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.గిరికుమార్‌రెడ్డి, కేవై కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన చేయి చేయి కలుపుదాం కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. వివిధ కార్యాలయాల్లో తిరిగి ఉద్యోగుల చేయిలో చేయి వేసి డిమాండ్ల సాధన కోసం ఉద్యమానికి సహకరించాలని కోరారు.

అంగన్‌వాడీల నిరసన

కర్నూలు(సెంట్రల్): తమ సమస్యల పరిష్కారం కోసం విజయవాడ వెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను నిర్బంధించడం రాష్ట్రప్రభుత్వానికి తగదని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షురాలు పి.నిర్మల పేర్కొన్నారు. సోమవారం ప్రభుత్వ వైఖరికి నిరసనగా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

అవమానపరిచే చర్యలు సరికాదు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల గ్రేడ్ వన్ నర్సింగ్ సూపరింటెండెంట్ రామతులశమ్మను అవమానపరిచే విధంగా ఆసుపత్రి అధికారుల చర్యలు ఉన్నాయని ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు మంజులదేవి సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆమెపై అవినీతి ఆరోపణలు వచ్చాయని పేర్కొంటూ ఎలాంటి విచారణ చేయకుండా, కమిటీ వేయకుండా ఒక పత్రికను తయారు చేసి అన్ని వార్డులు, నోటీస్ బోర్డుల వద్ద గోడలకు అతికించడం సరికాదన్నారు.

కార్మికులకు వస్త్రాల వితరణ



దుస్తులు పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని 40 వ వార్డులో కార్పొరేటర్ విక్రమ సింహారెడ్డి సోమవారం మున్సిపల్ కార్మికులకు వస్త్రాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకా హాజరయ్యారు. శానిటైజింగ్ సిబ్బంది, నీటి సరఫరా విభాగం, ఎలక్ట్రికల్ విభాగం, శానిటైజింగ్ వెహికల్ డ్రైవర్లకు ఈ వస్త్రాలను అందజేశారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ ప్రతి ఏడాది విక్రం సింహారెడ్డి ఇలాంటి సేవ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు లక్ష్మీకాంత రెడ్డి, సుదర్శన్ రెడ్డి, సాంబశివరావు, బాల చంద్రారెడ్డి, శ్వేతారెడ్డి, మున్సిపల్ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.



కల్యాణ మూర్తులుగా శివపార్వతులు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కమనీయం శివపార్వతుల కల్యాణం

కర్నూలు కల్చరల్: స్థానిక శ్రీనివాస నగర్ శ్రీసాత్యసాయి మందిరం ఆవరణలోని శ్రీసాయీశ్వరాలయంలో సోమవారం శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ముందుగా శివాలయం ప్రతిష్ఠ మండలం పూజలు, సహస్ర ఘటాభిషేకం, పంచామృత అభిషేకం, పుష్పార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారి కల్యాణం నిర్వహించారు. సత్యసాయి సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు మాకా అశోక్‌కుమార్, ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగుల క్రమబద్ధీకరణకు కౌన్సెలింగ్

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు జీఓ నెం.143 అమల్లో భాగంగా సోమవారం మినిస్టీరియల్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య తన ఛాంబర్‌లో ఉమ్మడి కర్నూలు జిల్లా పరిధిలోని ఆరుగురు సీనియర్ అసిస్టెంట్స్, ఒక జూనియర్ అసిస్టెంట్, 15 మంది ఎల్‌డీ కంప్యూటర్లకు కలిపి మొత్తం 22 మందికి కౌన్సెలింగ్ చేశారు. ఈ జాబితాను రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్‌కు పంపిస్తామని ఆయన తెలిపారు. వారి నుంచి తదుపరి ఉత్తర్వులు అందిన తర్వాత వాటిని అమలు చేస్తామన్నారు. ఏవో డాక్టర్ నాగప్రసాద్‌బాబు, సూపరింటెండెంట్ అరుణ, సీనియర్ అసిస్టెంట్ మధుసూదన్, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

‘శ్రీకృష్ణ కమలపాలిక’కు ప్రథమ బహుమతి

కర్నూలు కల్చరల్: తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 20 వ తేదీ వరకు మిర్యాలగూడలో నిర్వహించిన జాతీయస్థాయి పద్య నాటక పోటీల్లో ‘శ్రీకృష్ణ కమల పాలిక’ ప్రథమ స్థానంలో నిలిచింది. టీజీవీ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన ఈ పద్యనాటకాన్ని ప్రదర్శించారు. పల్లేటి కులశేఖర్ నాటక రచన చేయగా టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య దర్శకత్వం వహించారు. సోమవారం పోటీలు ముగియడంతో విజేతల వివరాలు వెల్లడించారు. ఉత్తమ నాటకంగా శ్రీకృష్ణ కమలపాలికకు ప్రథమ బహుమతి, ఉత్తమ నటుడుగా శ్రీకృష్ణ పాత్రదారి జి. శ్రీనివాసరెడ్డి, ఉత్తమ నటిగా కమల పాలిక పాత్రదారి సురభి ప్రభావతి, ఉత్తమ హాస్యనటుడిగా చిట్టిదొర పాత్రదారి సంగా ఆంజనేయులు, ఉత్తమ హాస్య నటిగా సింగారి పాత్రదారి హసీనా, ఉత్తమ సంగీతం హార్మోనిస్టు బి.బలరాముడు బహుమతులకు ఎంపికయ్యారు. ప్రతిభ కనబరిచి బహుమతులు పొందిన కళాకారులను దర్శకుడు పత్తి ఓబులయ్య అభినందించారు.

మరింత మెరుగ్గా మహిళల జీవనోపాధులు

కర్నూలు(అగ్రికల్చర్): స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళల జీవనోపాధులను మరింత మెరుగుపరచాలని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఏరియా కో–ఆర్డినేటర్లు, ఏపీఎంలకు డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం. వెంకటసుబ్బయ్య ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఆ సంస్థ కార్యాలయంలో ఏసీలు, ఏపీఎంలతో నిర్వహించిన సమావేశంలో పీడీ మాట్లాడారు. ఉన్నతి, స్త్రీనిధి బ్యాంకు లింకేజీ రుణాలతో జీవనోపాధులను అభివృద్ధి చేసుకునేందుకు అనేక మంది మహిళలు పాడి పశువులు, పొట్టేళ్లు, గొర్రెల పెంపకం వంటి యూనిట్లు ఎంపిక చేసుకున్నారని తెలిపారు. ఈ యూనిట్లను పశుసంవర్ధకశాఖ అధికారుల సహకారంతో గ్రౌండింగ్ చేయాలని ఆయన సూచించారు. గ్రౌండింగ్ ప్రక్రియకు సంబంధించిన విధి విధానాలు, మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. పాడుపు మహిళలకు సరైన జీవనోపాధులు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలస పోతున్నారన్నారు. దీనిని నివారించాలంటే జీవనోపాధులను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ రామచంద్రయ్య మాట్లాడుతూ... పాడిపశువులు, పొట్టేళ్లు, గొర్రె పిల్లల పెంపకం ద్వారా కలిగే ఉపయోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ–వైకేపీ అడిషినల్ పీడీ శ్రీధర్ రావు, డెయిరీ డీపీఎం అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కర్ణాటక భక్తుల సేవలో..

కర్నూలు కల్చరల్: శ్రీశైలేశుడి దర్శనానికి కాలినడకన వెళ్తున్న కర్ణాటక భక్తులకు పలువురు వివిధ రూపాల్లో సేవలు అందిస్తున్నారు. సోమవారం కర్నూలు జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వివేకానంద స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ నాగఫణిశాస్త్రి పర్యవేక్షణలో కళాశాల అధ్యాపకులు దేవకి, మధుసూదన్ రావు, వలంటీర్లు శ్రీచక్ర, శరత్, సాయి చరణ్, భార్గవ, ప్రేమ్‌సాయి, స్వరూప్‌లు బొల్లవరం, నల్లమల అటవీ ప్రాంతం నాగలూటి వీరభద్రస్వామి ఆలయం వద్ద అల్పాహారం , తేనీరు, మజ్జిగ, పండ్లు తదితర ఆహార పదార్థాలు అందజేశారు. అవసరమై భక్తులకు ప్రాథమిక చికిత్స అందించడంతో పాటు కాళ్ల నొప్పులు పోయేందుకు ఆయిల్ మసాజ్ చేశారు.

ఇందిరాగాంధీ హైస్కూల్‌లో ఈఎండీపీ ఎక్స్‌పో

కర్నూలు సిటీ: పాఠశాల విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల్లో వ్యవస్థాపక అభివృద్ధికి సహాయ పడే ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (ఈఎండీపీ) కింద సోమవారం ఇందిరాగాంధీ మున్సిపల్ మెమోరియల్ హైస్కూల్‌లో ఎక్స్‌పో ఏర్పాటు చేశారు. ప్రథమ అనే సంస్థ రాష్ట్ర విద్యాశాఖతో కలిసి 9వ తరగతి పిల్లలకు పారిశ్రామిక, ఆర్థిక, బడ్జెట్ నిర్వహణ అనే అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టింది. దీనిని డీఈఓ డాక్టర్ వెంకట రంగారెడ్డి ప్రారంభించి ప్రసంగించారు. పిల్లలకు పాఠశాల దశ నుంచే వ్యవస్థాపకత అభివృద్ధి గురించి తెలియజేసేందుకు ఈఎండీపీ కార్యక్రమం చక్కగా ఉపయోగపడుతుందన్నారు. ఎక్స్‌పోలో ఏర్పాటు చేసిన వాటిలో చిన్నబొంపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి రవికుమార్ రూపొందించిన హ్యాండ్‌ఫ్రీ అంబ్రెల్లా బ్యాగ్, కలుగొట్ల జెడ్పీహైస్కూల్ విద్యార్థి అశ్విన్ నాయుడు రూపొందించిన మేనేజ్‌మెంట్ ఆఫ్ కిచెన్ వేస్ట్ అనే ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి. సదరు విద్యార్థులకు డీఈఓ ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కో–ఆర్డినేటర్ రంగమ్మ, ఈఎండీపీ మేనేజర్ గోపాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయికి ఎంపికై ప్రశంసాలు అందుకున్న విద్యార్థులతో డీఈఓ డా.వి రంగారెడ్డి

అవీ-ఇవీ

పీడీపీ ఉద్యోగుల నిరసన

కర్నూలు(రాజ్‌విహార్): సమస్యలు పరిష్కరించాలని ప్రజా రవాణా శాఖ ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమం కొనసాగుతోంది. సోమవారం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కర్నూలు–1, 2 డిపోల ఎదుట ఆ సంఘం నాయకులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ఏవీ రెడ్డి, ఆర్‌వీఎం రావు, మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సెలవుల మంజూరుకు వినతి

కర్నూలు (టౌన్): అర్బన్ ప్రాంతంలోని సచివాలయ ఉద్యోగులకు జీవో నంబర్ 5 ప్రకారం అన్ని రకాల సెలవులు మంజూరు చేయాలని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు శివప్రసాద్, తారకేశ్వరరెడ్డి విన్నవించారు. సోమవారం నగర పాలక కార్యాలయంలో కమిషనర్ భార్గవ్‌తేజను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయాల సిబ్బందికి సెలవులు మంజూరు చేస్తున్నారన్నారు.

నేడు డయల్ యువర్ విద్యుత్ ఎస్‌ఈ

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు నేడు డయల్ యువర్ ఎస్‌ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 నుంచి 11గంటల వరకు కర్నూలు, నంద్యాల జిల్లాల వినియోగదారులు సెల్: 7382614308 నంబరుకు ఫోన్ చేసి సమస్యలు తెలియజేసి పరిష్కారం పొందాలని సూచించారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు కల్చరల్: విశ్వహిందూ పరిషత్ ఉగాది పంచాంగ కాలమానిని సోమవారం ఆవిష్కరించారు. స్థానిక ఆ సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ కేంద్రీయ సంయుక్త కార్యదర్శి స్థాణు మాలయన్, వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి కాకర్ల రాముడు, రాష్ట్ర సంఘటనా కార్యదర్శి జి.శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమిశెట్టి వెంకట్రామయ్య, మురలమ్మ, రాష్ట్ర సహ కార్యదర్శులు ప్రాణేష్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పెయింటర్ దుర్మరణం

కర్నూలు: నగర శివారులోని సంతోష్‌నగర్ వద్ద 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో సుధాకర్ (47) అక్కడికక్కడే మృతిచెందాడు. ఈయన పెయింటింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. నందికొట్కూరు రోడ్డులోని ఒమెగా ఆసుపత్రి సమీప కాలనీలో నివాసముంటాడు. ఈయనకు భార్య, ఇద్దరు కూతుర్లు సంతానం. సోమవారం ద్విచక్ర వాహనంపై సంతోష్‌నగర్ వైపు వెళ్తుండగా బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కర్ణాటక లారీ వెనుకవైపు నుంచి ఢీకొట్టి తలపై ఎక్కడంతో సుధాకర్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. మృతుడి సోదరుడు మల్లికార్జున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

కర్నూలు : బాలాజీనగర్‌లో నివాసముంటున్న షఫీ (26) ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయన ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. రెండేళ్ల క్రితం ఆటో నుంచి కింద పడి కాలు విరగడంతో రాడ్డు వేశారు. దీంతో తరచూ అతనికి ఆపరేషన్ చేసిన చోట నొప్పి ఉండేది. ఇటీవల బాత్‌రూమ్‌లో కింద పడటంతో కాలినొప్పి మరింత ఎక్కువైంది. బాధ భరించలేక సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. కొద్దిసేపు తర్వాత కుటుంబ సభ్యులు కనుగొని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఐదుగురికి అరుదైన గుండె ఆపరేషన్లు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో 20 రోజుల వ్యవధిలో ఐదుగురికి అరుదైన గుండె శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆసుపత్రిలోని కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో ఆయన వివరాలు వెల్లడించారు. గత ఫిబ్రవరి 28న కర్నూలు అశోక్‌నగర్‌కు చెందిన కేదారేశ్వరయ్య(54) అనే ఆటోడ్రైవర్‌కు కరనరి ఆర్టరీ బైపాస్ గ్రాఫ్ట్ ఆపరేషన్ చేశామన్నారు. అలాగే ప్రకాశం జిల్లా దర్శికి చెందిన పుల్లారెడ్డి(35) అనే రైతుకు టీబీ వల్ల ఊపిరితిత్తులు దెబ్బతింటే ఈ నెల ఒకటో తేదీన న్యూమోనెక్టమి ఆపరేషన్ చేశామన్నారు. కోసిగికి చెందిన లక్ష్మన్న(30) అనే దివ్యాంగుడికి ఈ నెల 30న మైట్రల్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్ చేసినట్లు వివరించారు. అనంతపురం పట్టణం నుంచి కత్తిపోటుతో వచ్చిన శ్రీనివాసరెడ్డి(50) అనే వ్యక్తికి ఈ నెల 12వ తేదీన అత్యవసర ఆపరేషన్ చేసి కత్తి తొలగించామన్నారు. కర్నూలు మండలం బి.తాండ్రపాడు కు చెందిన నిహంత్ (7) అనే బాలుడికి అతి క్లిష్టమైన వీఎస్‌డీ క్లోజర్, పాత్ రీ రూటింగ్ ఆపరేషన్‌ను ఈ నెల 7వ తేదీన నిర్వహించామన్నారు. వీరందరికీ డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీలో ఆపరేషన్లు ఉచితంగా చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వారంతా కోలుకుని డిశ్చార్జ్ అయినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇతర జిల్లాల నుంచి కూడా ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేయించుకునేందుకు రోగులు ఇక్కడికి వస్తున్నారని తెలిపారు. ఈ ఆపరేషన్లను అనెస్తీషియా ప్రొఫెసర్ డాక్టర్ కొండారెడ్డి, పర్ఫ్యూజనిస్టు రమేష్‌రెడ్డి సహకారంతో నిర్వహించినట్లు పేర్కొన్నారు.



ఆపరేషన్ చేయించుకుని డిశ్చార్జ్ అవుతున్న రోగులతో డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి బృందం

తాగునీటి సమస్య పరిష్కరించండి

కర్నూలు (టౌన్) : నగరంలోని బుధవారపేట, రామప్రియ నగర్, స్వామిరెడ్డి నగర్‌లలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆయా ప్రాంతాలకు చెందిన మన్సూర్, జ్ఞాన ప్రసన్న, చెన్నయ్య నగరపాలక అధికారులను కోరారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో కమిషనర్ భార్గవ్‌తేజ స్పందన కార్యక్రమం నిర్వహించారు.పలువురు వివిధ సమస్యలపై కమిషనర్‌ను కలిసి వినతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎస్ఈ శేషసాయి, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, మేనేజర్ చిన్నరాముడు, ఆర్‌ఓ జునీద్ పాల్గొన్నారు

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. సోమవారం స్థానిక పాతబస్టాండ్ సమీపంలోని కొండారెడ్డి బురుజు వద్ద అభివృద్ధి, బ్యూటిఫికేషన్‌కు సంబంధించిన పనులను పరిశీలించారు. అక్కడే ఉన్న ఏఈ దినేష్‌ను పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చెన్నమ్మ సర్కిల్ సమీపంలోని సుంకులమ్మ గుడి వద్ద డివైడర్, డ్రైనేజీ సంబంధ పనులు పరిశీలించారు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

స్పోర్ట్స్

నెట్‌బాల్ పోటీల్లో కర్నూలు జట్టు రన్నర్

కర్నూలు (టౌన్) : విజయవాడలో ఈనెల 18,19 తేదీల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సీనియర్ నెట్‌బాల్ క్రీడా పోటీల్లో కర్నూలు జట్టు ప్రతిభ చాటి రన్నర్‌గా నిలిచింది. సోమవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జట్టు సభ్యులను సీఈఓ రమణ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు నెట్‌బాల్‌లో రాణించి జిల్లాకు పేరుతీసుకువచ్చారన్నారు. కార్యక్రమంలో నెట్ బాల్ సంఘం జిల్లా కార్యదర్శి నాగరత్నమయ్య, వంశీకృష్ణ పాల్గొన్నారు,



నెట్‌బాల్ జట్టును అభినందిస్తున్న సీఈఓ రమణ

క్రీడల్లో విద్యార్థినులు రాణించాలి

కర్నూలు (టౌన్) : చదువులోనే కాదు క్రీడల్లోనూ విద్యార్థినులు రాణించాలని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం సీఈఓ రమణ అన్నారు. సోమవారం స్థానిక కేవీఆర్ కళాశాలలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. అలాగే స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల క్రీడా మైదానంలో మహిళలు, యువతులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. అంతర్జాతీయ మహిళదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్టేడియం చీఫ్‌కోచ్ నటరాజరావు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌లో సత్తాచాటిన ట్రిపుల్ ఐటీడీఎం జట్టు



ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన కర్నూలు ట్రిపుల్ ఐటీడీఎం జట్టు

కర్నూలు (టౌన్): చెన్నైలోని కాంచీపురంలో ఈనెల 14 నుంచి 17 వ తేదీ వరకు నిర్వహించిన ట్రిపుల్ ఐటీడీఎం అంతర కళాశాలల పోటీల్లో కర్నూలుకు చెందిన ట్రిపుల్ ఐటీడీఎం జట్టు చాంపియన్‌గా నిలిచింది. పోటీలు నిర్వహించిన అన్ని క్రీడాంశాల్లోనూ 3 వ స్థానంలో నిలిచి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. వాలీబాల్, టెన్నిస్, క్యారెమ్స్, టెబుల్‌టెన్నిస్, హైజంప్, షాట్‌పుట్, లాంగ్‌జంప్, పవర్ లిఫ్టింగ్, క్రికెట్, కబడ్డీ, డిస్కస్‌త్రో, ట్రిపుల్ జంప్ తదితర క్రీడాంశాల్లో కర్నూలు విద్యార్థులు 74 పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు సత్యబాబు, పుల్లారావు, అక్తర్, యశ్వంత్,నోయల్ అభినందించారు.